క్లుప్తంగా

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గీసుకొండ: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని టెలీ మానస్ శిక్షకుడు డాక్టర్ రత్‌కుమార్ అన్నారు. మండలంలోని కొనాయమాకుల వద్దగల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉదయమే నిద్రలేవడం, రాత్రి త్వరగా పడుకోవడం, నిద్రపోయే సమయంలో మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. సమతుల ఆహారం తీసుకుంటూ జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ అశోక్‌రావు, స్టూడెంట్ కౌన్సిలర్ రాజ్‌కుమార్, ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ మహేందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



చెన్నారావుపేట: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా విద్యార్థులకు పునరుత్పాదక శక్తి వనరులు అంశంపై మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సరళ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనాలన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఈనెల 29న శంభునిపేట హైస్కూల్‌లో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, వెంకటేశ్వర్‌రావు, రామకృష్ణ, యశోద, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

'రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని అడ్డుకోవాలి'



నర్సంపేట: ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని అడ్డుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నర్సంపేట పట్టణ శివారులోని మాదన్నపేట రోడ్డును ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 111లో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూమిని బుధవారం ఎంసీపీఐ (యూ) నాయకులు పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ ఉమాదేవికి వినతిపత్రం అందజేశారు. డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, రాష్ట్ర కమిటీ సభ్యులు వంగాల రాగసుధ, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ.మాషుక్, కార్యకర్తలు జన్ను జమున, బైరబోయిన నర్సయ్య, ముప్పారపు రాజు, మహ్మద్ రహమాన్, ఎండీ.ఆసిఫ్, సకినబోయిన భవాని, బిందు, మణెమ్మ, కోమల, షబానా తదితరులు పాల్గొన్నారు.

'సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు పెట్టొద్దు'

నెక్కొండ: సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు పెడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై మహేందర్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతాలు, వర్గాలు, గ్రామాల్లో గ్రూపుల మధ్య తగాదాలు కలిగించేలా పోస్టులు పెట్టడం చట్టవిరుద్ధమన్నారు. ఇలాంటి మెసేజ్‌లను ఫార్వర్డ్ చేసినా.. గ్రూప్ అడ్మిన్లు, ఫార్వర్డ్ చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అలాంటి వ్యక్తుల విషయాల్లో గ్రూప్ అడ్మిన్‌లు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు గ్రూప్ నుంచి మెసేజ్‌లు, వ్యక్తులను తొలగించాలని ఎస్సై సూచించారు.

చర్యలు తీసుకోవాలి

పర్వతగిరి: మండలంలోని చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని వరంగల్ డీసీఓకు పది మంది డైరెక్టర్లు గత నెల 28వ తేదీన చేసిన ఫిర్యాదుపై వరంగల్ డీసీఓ తక్షణమే సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ డీసీఓ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చౌటపల్లి పీఏసీఎస్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా.. విచారణ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రాజకీయ ఒత్తిళ్లకు పాల్పడకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం విచారణ చేసి రైతుల సొమ్ము దుర్వినియోగం చేసిన చైర్మన్, వైస్ చైర్మన్‌లను పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థికి అభినందన

కేయూ క్యాంపస్: మహారాష్ట్ర పూణేలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపులో పాల్గొన్న కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని తోట అంజలిని ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షాలు, అధ్యాపకులు కళాశాలలో బుధవారం అభినందించారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

- ఇరుకు గదులతో అవస్థలు
- పౌష్టికాహారం నిల్వ చేసేందుకు తప్పని తిప్పలు
- ఖాళీగా టీచర్లు, ఆయాల పోస్టులు

మండలంలోని అంగన్‌వాడీల వివరాలు

అంగన్‌వాడీ సెక్టార్లు	3
అంగన్‌వాడీ కేంద్రాలు	65
మూడేళ్ల లోపు చిన్నారులు	1,412
3నుంచి ఐదేళ్ల చిన్నారులు	834
గర్భిణులు	261
బాలింతలు	283



నాగారంలో అద్దె ఇంటిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

నెక్కొండ: చిన్నారులకు పాఠశాలలు, చదువుపై ఆసక్తి కలిగించడం, సకాలంలో పౌష్టికాహారం అందించి వారి ఎదుగులను పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పక్కా భవనాలు, టీచర్లు, ఆయాల లేమితో ఇబ్బందిగా మారింది. ఇరుకు గదులు, అద్దె భవనాలు, ప్రభుత్వ భవనాల్లో కేంద్రాలను నిర్వహిస్తున్నారు. దీంతో టీచర్లు, చిన్నారులు ఇబ్బందులు పడుతూ.. పక్కా భవనాల కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. మండలంలో మొత్తం 65 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. వీటిలో ఇప్పటి వరకు 15 కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలు నిర్మించారు. 50 కేంద్రాలను ఆయా గ్రామాల్లో అద్దె, కమ్యూనిటీ భవనాలు, తదితర ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఒకే చోట రెండు అంగన్‌వాడీ కేంద్రాలు సైతం నిర్వహించడం గమనార్హం.

అద్దె ఇళ్లతో ఇక్కట్లు..

మండంలో 3 అంగన్‌వాడీ సెక్టార్లు.. నెక్కొండ, దీక్షకుంట, రెడ్లవాడ ఉన్నాయి. ఆయా సెక్టార్ల పరిధిలో 65 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 3 నుంచి ఐదేళ్ల లోపు 834 మంది చిన్నారులు ఉండగా వీరికి ఇంటి వద్దే పౌష్టికాహారం అందిస్తున్నారు. 7 నెలల నుంచి మూడేళ్ల లోపు 1,412 మంది చిన్నారులు ఉన్నారు. 261 మంది గర్భిణులు, 283 మంది బాలింతలు ఉన్నారు. వీరందరికీ ఒక పూట సంపూర్ణ భోజనం వడ్డిస్తారు. కేంద్రాలను ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తుండటంతో ఇళ్ల యజమానులు, గ్రామ పెద్దలు ఎప్పుడు ఖాళీ చేయమంటే అప్పుడు మరో ఇల్లు వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఇలా సంవత్సరానికో ఇంట్లో కేంద్రాలను నిర్వహించడం వలన టీచర్లు, ఆయాలు ఇబ్బందులు పడుతుంటే పిల్లలను కేంద్రాలకు పంపడానికి తల్లిదండ్రులు ఇష్టపడటం లేదు.

టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీ

నెక్కొండ సెక్టార్‌లో వెంకట్ తండా, దీక్షకుంట సెక్టార్ పరిధిలో దీక్షకుంట-1, దేవునితండా కేంద్రాల్లో టీచర్లు లేక పిల్లలు, ఆయాలు ఇబ్బందులు పడుతున్నారు. మండలం వ్యాప్తంగా 21 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అవి.. నెక్కొండ సెక్టార్ పరిధిలో నెక్కొండ-2, నెక్కొండ తండా, వెంకట్ తండా, గుండ్రపల్లి, చిన్నకొర్పోలు, దీక్షకుంట సెక్టార్ పరిధిలో బంజరుపల్లి, లావుడ్యా తండా, చంద్రుగొండ, చంద్రుగొండ-2, ఆర్‌కే (రామన్నకుంట) తండా, టీకే (టీకుల కుంట) తండా, రేసుల బోడు తండా, ఇంగ్యా తండా, రెడ్లవాడ పరిధిలో మాలోతు నంద తండా, గుగులోతు తార్య తండా, రెడ్లవాడ-1, సాయిరెడ్డిపల్లి, నిమ్మనాల తండా, రక్మీ తండా, భూక్య తండాలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పక్కా భవనం నిర్మించాలి..



నాగారం అంగన్‌వాడీ కేంద్రం కొన్నేళ్లుగా అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం రూ.వెయ్యి అద్దె చెల్లించగా.. ఇంటి యజమానులు ఎక్కువ అడుగుతున్నారు. అవి కూడా ఆరు నెలలకోసారి రావడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం పక్కా భవనం నిర్మించాలి.

– ఇస్లావత్ భారతి, అంగన్‌వాడీ టీచర్, నాగారం

ఆయా లేక ఇబ్బంది



అంగన్‌వాడీ కేంద్రానికి ఆయా లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. ఇంటింటికీ తిరిగి నేనే పిల్లలను కేంద్రానికి తీసుకురావడంతోపాటు కేంద్రాన్ని శుభ్రం చేసుకోవాలి. అన్ని పనులు చూసుకోవడానికి ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం స్పందించి ఆయాను నియమించాలి.

– తాళ్లపల్లి అరుణ, అంగన్‌వాడీ టీచర్, నెక్కొండ-2

ఉన్నతాధికారులకు నివేదించాం



మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు, టీచర్ల ఖాళీలతోపాటు, పక్కా భవనాలు లేని కేంద్రాల వివరాలను ఉన్నతాధికారులకు వివరించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే భవనాల నిర్మాణానికి అధికారులు చొరవ తీసుకుంటారు. సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తాం.

–భాగ్యమ్మ, సూపర్‌వైజర్ నెక్కొండ సెక్టార్

దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్



సమావేశంలో మాట్లాడుతున్న గిద్దె రాజేశ్

వర్ధన్నపేట: అసెంబ్లీ ఎన్నికల ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీపై ఉద్యమిస్తామని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఇల్లంద గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన తల్లి గిద్దె భాగ్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా చిత్రపటానికి పూలమాల వేసి నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వికలాంగుల హక్కుల సాధన కోసం సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కోడంగల్ నుంచి డిసెంబర్ 3 నుంచి పోరాటాన్ని ప్రారంభిస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగులకు రూ.6వేలు పింఛన్ ఇస్తామని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. కానీ, అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా హామీలు నెరవేర్చలేదన్నారు. తమ సమస్యలను పట్టించుకోని రేవంత్‌రెడ్డి పాలనను నిరసిస్తూ ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నుండి పోరాటాన్ని ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో ఎండీ షరీఫ్, కొల్లూరి ఈదయ్య బాబు, గుడిపల్లి సుమతి, జెట్టబోయిన శ్రీనివాస్, ఇస్లావత్ బాలకృష్ణ, వెన్నెల, సుస్మిత ఆకారపు వెంకన్న యాదయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఆర్‌డీఎఫ్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పర్వతగిరి: వరంగల్‌లో ఈనెల 25వ తేదీన జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలో మండలంలోని రోళ్లకల్ ఆర్‌డీఎఫ్ స్కూల్ విద్యార్థులు పాల్గొని ఐదు మెడల్స్ సాధించడంతోపాటు నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబర్ 1వ తేదీన మంచిర్యాలలో జరిగే రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఎం.యశ్వంత్, ఏ.అభినయ్, ఇ.భార్గవి, అఖిల్ పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాషబోయిన రాములు, రమేశ్, బాలరాజ్, పీఈటీలు సురేశ్, సునీల్ అభినందించారు.

కార్తీక వనభోజనాలు



వనభోజనాల్లో పాల్గొన్న ప్రజలు

ఖానాపురం: మండలంలోని పాకాలలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. నర్సంపేట పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు శ్రీవిష్ణు సహస్ర పారాయణం, కార్తీక దామోదర వ్రతాలను అర్చకులు రామానుజాచార్య వేదమంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పురోహితులు శ్రీఖరాచార్య, రంగనాథస్వామి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



పడిపూజలో పాల్గొన్న స్వాములు



అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్న స్వాములు

పర్వతగిరి: మండల కేంద్రంలో బుధవారం చింతకుంట్ల మల్లికార్జున్ గురుస్వామి ఏర్పాటు చేసిన అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని స్వాములు ఘనంగా నిర్వహించారు. అయ్యప్పకు పంచామృతంతో అభిషేకం, పుష్పాభిషేకం, చందన, పసుపు, కుంకుమల అభిషేకం, ధూపం దీపం నైవేద్యం సమర్పించారు. అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. అనంతరం స్వాములకు బిక్ష (భోజనం) ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు రాములు, బోగోజు రమేష్, ఫణిశర్మ, మాడులు రాజు, ముంజాల రాజు, గురుస్వాములు, కన్నెస్వాములు, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలి'

నర్సంపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒకే దేశం, ఒకే మతం అనే నినాదాన్ని అమలు చేయాలనే కుట్రలో భాగంగానే భారత రాజ్యాంగాన్ని మార్చాలని మరోసారి పూనుకుందని బీజేపీ కుట్రలను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తిప్పికొట్టాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా బొజ్జ తారకం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్రంలోని మనువాద బీజేపీ, ఆర్ఎస్ఎస్.. రాజ్యాంగంలోని లౌకికవాదం, ప్రజాస్వామ్యం అనే అంశాలను తొలగించాలని సుప్రీం కోర్టులో పిటిషన్ వేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 26నుంచి జనవరి 26వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగే రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

'మాస్' సమావేశాన్ని జయప్రదం చేయాలి

- మాదిగల ఐక్య సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవీందర్



మాట్లాడుతున్న మిద్దెపాక రవీందర్

వర్ధన్నపేట: పార్టీలు, సంఘాలకు అతీతంగా మాదిగ జాతిని ఒకే వేదిక మీదకు తీసుకురావాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మాదిగల ఐక్య సంక్షేమ సంఘం (మాస్) విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెపాక రవీందర్ పిలుపునిచ్చారు. బుధవారం వర్ధన్నపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సంఘం నాయకుల సమావేశంలో రవీందర్ మాట్లాడారు. డిసెంబర్ 2న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కీలకమైన అంశాలపై వివిధ రంగాల్లో పని చేస్తున్న మాదిగ జాతి బిడ్డలను మాస్ కదిలించిందన్నారు. డిసెంబర్ 2న జరిగే సమావేశంలో సంఘం నిర్మాణం కోసం రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు, ప్రజాక్షేత్రంలో సమస్యల మీద పోరాటం చేసి జాతిని ఐక్యత చేయడం భవిష్యత్ కార్యచరణ వంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు జన్ను రాములు, మారెపెల్లి ఎల్లయ్య, మరిపట్ల మస్తాన్, మరిపట్ల బాస్కర్, చిదురాల శ్యామ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



నల్లబెల్లి: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



రాయపర్తి: నిరసన తెలుపుతున్న సిబ్బంది

నల్లబెల్లి: కేజీబీవీ, యూఆర్ఎస్ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కుమారస్వామి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మినిమం టైమ్ స్కేల్ సాధించడానికి దశల వారీగా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. సమస్యలను పరిష్కరించుకోవడానికి ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, రవూఫ్, సంతోష్‌కుమార్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

రాయపర్తి: మండలంలోని తిర్మలాయపల్లి కస్తూర్బా గాంధీ వసతిగృహంలో బుధవారం నాన్‌టీచింగ్ సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లో సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని, పే స్కేల్ అమలు చేస్తామని చెప్పి నేటికీ చేయలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిచో డిసెంబర్‌లో సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెకు వెళ్తారని తేల్చి చెప్పారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ.. చేయూత



అంత్యక్రియల్లో పాల్గొన్న దయాకర్‌రావు



గీసుకొండ: సాయం అందజేస్తున్న మిత్రులు

రాయపర్తి: మండలంలోని ఊకల్ గ్రామానికి చెందిన రాయపర్తి పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి సతీమణి కుందూరు వెంకటలక్ష్మి అంత్యక్రియల్లో, కొండాపురంలో మృతిచెందిన ఎద్దు నారాయణ అంత్యక్రియల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలను ఓదార్చి ధైర్యం చెప్పారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, రమేశ్, రంగయ్య, భిక్షపతి, యాకయ్య, ఎల్లస్వామి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఖానాపురం: కొత్తూరు గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ క్యాతం సాయికుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విధితమే. కాగా బాధిత కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లడే రవి, జిల్లా కమిటీ అధ్యక్షుడు లింగమూర్తి, మండల అధ్యక్షుడు తడుగుల స్వామి ఆధ్వర్యంలో బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.70 వేలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు సూరిబాబు, శ్యాం, కిరణ్, రవి, శ్యాం, వెంకటేష్, రాజు, శ్రీనివాస్, వాసు, సతీశ్, రమేశ్, సంతోశ్, శ్రీకాంత్, నరేశ్ పాల్గొన్నారు.

పర్వతగిరి: మండలంలోని ఏనుగల్ గ్రామానికి చెందిన నాగెల్లి యాకయ్య ఇటీవల మృతి చెందాడు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూపు సభ్యులు బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.11 వేలు, మిగతా వారు రూ.4,500 అందజేశారు.

గీసుకొండ: ఎలుకుర్తిహవేలికి చెందిన బీమగాని సంతోశ్ ఇటీవల మృతిచెందాడు. ఆయనతో కలిసి చదువుకున్న 1997–98 టెన్త్ మిత్రులు బుధవారం సంతోశ్ కుటుంబానికి రూ.50 వేల అందించారు.

వర్ధన్నపేట: మండలంలోని శ్రీరామోజి కుమ్మరిగూడేనికి చెందిన బీజేపీ నాయకుడు నాంపెల్లి శేఖర్ తల్లి యాదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ కుటుంబాన్ని పరామర్శించి యాదమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జడ సతీశ్, ఎండీ రఫీ, చిర్ర రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ...

దుగ్గొండి: నాచినపల్లికి చెందిన ఓరుగంటి కవిత కేన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతి చెందింది. ఈమేరకు బుధవారం మృతదేహాన్ని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో తిరుపతి, కుమారస్వామి, రాము, అశోక్, శ్రీకాంత్, రమేష్, సాంబయ్య, యుగంధర్, ప్రకాశ్, సతీష్, రాజేందర్, రవి, దేవేందర్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

- డీబీఎఫ్ ఉపాధ్యక్షుడు రాజేందర్



నినాదాలు చేస్తున్న డీబీఎఫ్ ప్రతినిధులు

గీసుకొండ: భారత రాజ్యాంగాన్ని మనువాదుల చెర నుంచి రక్షించుకుందామని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. బుధవారం గీసుకొండలో భారత రాజ్యాంగ విలువల పరిరక్షణ ప్రచారోద్యమంలో భాగంగా చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డీబీఎఫ్ ఆధ్వర్యంలో జనవరి 26 వరకు నిర్వహించే ఈ ప్రచార ఉద్యమానికి అందరూ మద్దతు పలకాలని కోరారు. డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్, న్యాయవాది కలకోటి మహేందర్, రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్‌గాడ్గే పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలి

హన్మకొండ చౌరస్తా: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలని అడిషనల్ డిప్యూటీ డీఎంహెచ్ఓ మదన్మోహన్ సూచించారు. పెద్దమ్మగడ్డలోని ప్రభుత్వ పాలెం పాఠశాలలో విద్యార్థులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు.

ఉద్యమకారుల పాదయాత్రలో వర్ధన్నపేట వాసులు



పాదయాత్రలో వర్ధన్నపేట ఉద్యమకారులు

వర్ధన్నపేట: తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ చేపట్టిన ఉద్యమకారుల సంకల్ప మహా పాదయాత్రలో రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్‌తో కలిసి వర్ధన్నపేట ఉద్యమకారులు బుధవారం పాల్గొన్నారు. పులి శ్రీనివాస్, మాడిశెట్టి లక్ష్మణ్, కన్నం కుమారస్వామి, తుమ్మల రవీందర్, నాగర్జున్, వెంకట్, షబ్బీర్, రమేష్, గోధుమల విక్రమ్ పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ వేగంగా పూర్తి చేయాలి

- ఎంపీడీఓ వెంకటరమణ



డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వర్ధన్నపేట: సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ, కుల సర్వే డేటా ఎంట్రీ వేగంగా చేపట్టాలని వర్ధన్నపేట ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలోని డేటా ఎంట్రీ బ్లాకును బుధవారం ఎంపీడీఓ సందర్శించి నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆపరేటర్లకు ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. ఎంపీడీఓ వెంకటరమణ మాట్లాడుతూ.. డేటా ఎంట్రీలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. ఎంపీఓ ధనలక్ష్మి, కార్యాలయ సూపరింటెండెంట్ జానకి, సీసీ గోలి కొమురయ్య, పంచాయతీ కార్యదర్శులు రామారావు, దేవేందర్, పృథ్వీరాజు, కంప్యూటర్ ఆపరేటర్లు సంతోశ్ సురేశ్, మురళి, జానకిరాములు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నాటుసారా స్థావరంపై పోలీసుల దాడి



నాటు సారాను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నెక్కొండ: మండలంలోని హరిచంద్రు నాయక్ తండాలో బుధవారం నాటు సారా స్థావరంపై పోలీసులు దాడులు జరిపారు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన జాటోతు రవి అక్రమంగా నాటు సారా తయారీ, రవాణా, అమ్మకాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో పక్కా సమాచారం మేరకు స్థావరంపై దాడులు జరిపి 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని 400 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. అక్రమ దందాకు పాల్పడుతున్న రవిపై కేసు నమోదు చేశామన్నారు.